క్లుప్తంగా

నేడు భీమేశ్వరుని జన్మనక్షత్ర పూజలు

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో బాలాత్రిపుర సుందరీ సమేత కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు జరుగుతాయని ఈఓ భళ్ల నీలకంఠం ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్వామివారి జన్మనక్షత్రమైన ఆరుద్రను పురస్కరించుకుని తెల్లవారుజామున 4 గంటలకు స్వామివారికి విశేష అభిషేకాలు నిర్వహించనున్నారు. ఉదయం ఏడు గంటల నుంచి స్వామివారి అన్నప్రసాద వితరణ ఉంటుంది. అదే విధంగా హైదరాబాద్‌కు చెందిన దివీస్ లాబొరేటరీ వారు రూ. 18 లక్షలతో నిర్మించిన ఆర్వో ప్లాంట్‌ను ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప ప్రారంభిస్తారని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివారి ప్రసాదం స్వీకరించాలన్నారు.

కోడి పందేలు నిర్వహిస్తే చర్యలు



కోడి పందేల టెంట్‌లను తొలగిస్తున్న సీఐ, తహసీల్దార్

సామర్లకోట: సంక్రాంతిని పురస్కరించుకుని కోడి పందేలు, జూదం క్రీడలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ కొవ్వూరి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఉండూరు, వీకే రాయపురం గ్రామాల పరిధిలో ఏర్పాటు చేసిన కోడి పందేల టెంటులను సీఐ ఎ.కృష్ణభగవాన్ పర్యవేక్షణలో తొలగించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సంక్రాంతిని పురస్కరించుకుని సంప్రదాయ క్రీడలతో ఆనందంగా గడపాలన్నారు. కోడి పందేలు, గుండాట వంటి జూదాలు జోలికి వెళ్లొద్దని హెచ్చరించారు.

జూదాలు ఆడొద్దని ప్రచారం



వాకతిప్పలో మైక్ ద్వారా ప్రచారం చేస్తున్న పోలీస్ సిబ్బంది

కొత్తపల్లి: సంక్రాంతి పండగ నేపథ్యంలో గ్రామాల్లో కోడి పందేలు, పేకాట, గుండాట వంటి జూదాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఈ మేరకు మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం ఎస్సై వెంకటేష్ ఆధ్వర్యంలో మైక్ ద్వారా పోలీస్ సిబ్బంది ప్రచారం నిర్వహించారు. గ్రామాల్లో ఎక్కడైనా కోడి పందేలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

మున్సిపల్ స్టాక్ యార్డులో అగ్నిప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

పిఠాపురం: గొల్లప్రోలు నగర పంచాయతీ మున్సిపల్ స్టాక్ యార్డులో ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో మున్సిపల్ శానిటరీ సామగ్రితో పాటు చెప్పుల దుకాణం పూర్తిగా దగ్ధమయ్యాయి. పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాదం ఎలా జరిగిందన్న విషయంతో పాటు నష్టం అంచనా వేస్తున్నారు.

మానవతా విలువలు పెంపొందించుకోవాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న గోవిందరాజులు

పెద్దాపురం: చిన్న వయసు నుంచే మానవతా విలువలు పెంపొందించుకోవాలని, దీనికి విధిగా సత్యసాయి బాల వికాస్ తరగతులకు చిన్నారులు రావాలని శ్రీసత్యసాయి సేవా సంస్థల కాకినాడ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు అన్నారు. వడ్లమూరు సత్యసాయి మందిరంలో ఆదివారం సేవా సమితి కన్వీనర్ చల్లా సాయిరామ్ అధ్యక్షతన సత్యసాయి శత జయంతి ఉత్సవాలు, సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గోవిందరాజులు మాట్లాడుతూ విద్యతో పాటు సంస్కారాన్ని పెంపొందించుకోవాలన్నారు. స్థానిక సేవాదళ్ కో ఆర్డినేటర్ వై.వీరభద్రరావు మాట్లాడుతూ 2007లో భీష్మ ఏకాదశి సందర్భంగా మందిర శంకుస్థాపన సందర్భంలో కొబ్బరికాయ నుంచి సత్యసాయి విగ్రహం రావడం, బాబా అనుగ్రహంతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌డీఎఫ్‌సీ వైస్ చైర్మన్ ఎన్.శ్రీనివాస్, సేవాదళ్ సమన్వయకర్త పాలచర్ల శ్రీనివాస్, మహిళా సమన్వయకర్త రాధిక, నాగేశ్వరరావు, ఎల్.శ్రీనివాసరాజు, మధుశ్రీ, సాయిలక్ష్మి, దొడ్డి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి పందేలకు రెఢీ

- కోడి పందేలకు బరులు సిద్ధం
- ఆడితే వదిలేది లేదంటున్న పోలీసులు
- ఆడకపోతే పండగ ఎందుకని పందెం రాయుళ్ల బరితెగింపు



పందేలకు సిద్ధంగా ఉన్న కోళ్లు

పిఠాపురం: సంక్రాంతి పండగ వచ్చేసింది. పండగకు కొత్త దుస్తులు, పిండివంటలు ఇళ్ల వద్ద ముగ్గులు, హరిదాసుల కీర్తనలు ఇలా అన్ని సంప్రదాయాలతో గ్రామాలు, పట్టణాలు కళకళలాడుతూ సంక్రాంతికి స్వాగతం పలుకుతున్నాయి. మూడు రోజుల పాటు జరిగే పెద్ద పండగలో సంప్రదాయ కోడిపందేలు ఒక భాగం. కాగా ఈ ఏడాది పందేలకు కోర్టు అనుమతి ఇవ్వకపోవడంతో ఆడితే తాట తీస్తామని పోలీసులు ప్రకటిస్తుంటే సంప్రదాయాన్ని ఎలా మానుకుంటామంటూ పందెం రాయుళ్లు తమ పనిలో తాము మునిగిపోయారు.

ప్రత్యేక నిఘా..

పిఠాపురంలో కోడిపందేలపై పోలీసులు గురిపెట్టారు. బరులు ఏర్పాటు చేసే చోట పోలీసులు కోడి పందేలు ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గ్రామాల్లో సైతం గట్టి చర్యలు తీసుకున్నట్లు పోలీసులు చెబుతున్నారు. ఇప్పటికే జిల్లా ఎస్పీ కోడిపందేలకు అనుమతి లేదని, ఆడితే కఠిన చర్యలు తప్పవని ప్రకటించిన నేపథ్యంలో స్థానిక పోలీసులు కోడిపందేలపై ఉక్కుపాదం మోపుతామంటూ ప్రచారం చేస్తున్నారు. కాగా కత్తులు కట్టకుండా సంప్రదాయంగా అని పైకి చెబుతున్నా పిఠాపురం గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో పలు గ్రామాల్లో పందేలు ప్రారంభించడానికి పందెం రాయుళ్లు బరులు సిద్ధం చేసినట్టు పోలీసులు గుర్తించారు.

పిఠాపురం మండలం పి.దొంతమూరు, పిఠాపురం పట్టణంలోని వైఎస్సార్ గార్డెన్స్, కొత్తపల్లి మండలం ఇసుకపల్లి, గొల్లప్రోలు మండలం కొడవలి వంటి ప్రాంతాల్లో ఈ నెల 13, 14, 15 తేదీల్లో భారీ స్థాయిలో కోడిపందేలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే పందేల నిర్వహణకు, బరుల ఏర్పాటుకు వేలం పాటలు సైతం పూర్తయినట్టు సమాచారం. ఇక పందేలు ఆరంభమైతే గుండాట సంగతి చెప్పనక్కరలేదు. ఎక్కడ బరి ఉంటే అక్కడ గుండాట ఆడుకోడానికి బోనస్‌గా అవకాశం ఇస్తుంటారు. ఇప్పటికే అన్ని గ్రామాల్లో పేకాట శిబిరాలకు ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండడంతో టీడీపీ, జనసేన నేతలు విడివిడిగా బరులు ఏర్పాటు చేస్తుండడంతో ప్రతి గ్రామంలోనూ బరుల సంఖ్య రెట్టింపు అయ్యిందని ప్రచారం జరుగుతోంది.

జూదాలకు అనుమతి లేదు

కోడి పందేలు, పేకాట, గుండాటకు ఎటువంటి అనుమతి లేదు. ఎవరైనా ఆడినా, ఆడించినా కఠిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే వీటి నివారణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. గస్తీని ముమ్మరం చేశాం. కత్తులు కట్టే వాళ్లను, గతంలో కోడిపందేలు, పేకాటల్లో పట్టుబడిన వారిపై బైండోవర్ కేసులు నమోదు చేస్తాం. ఏయే గ్రామాల్లో పందేలు జరుగుతాయో ముందుగా గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నాం.

–శ్రీనివాస్, సీఐ, పిఠాపురం

గోదా కల్యాణానికి ఏర్పాట్లు



కుంతీ మాధవస్వామి

పిఠాపురం: భోగి పండగ సందర్భంగా వైష్ణవాలయాల్లో సోమవారం గోదా కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. శ్రీరంగనాథుని మనసా వాచా కర్మణా భర్తగా నమ్మిన గోదాదేవి ఆ స్వామి అనుగ్రహం పొందిందని, అందుకే దానికి గుర్తుగా భోగి రోజున వైష్ణవాలయాల్లో గోదాదేవి కల్యాణం జరిపిస్తుంటారు. ఈ నెల 13న పిఠాపురంలో వేంచేసి ఉన్న కుంతీ మాధవస్వామి, కొత్తపల్లికి చెందిన రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయాల్లో ఉదయం ప్రత్యేక పూజలు, సాయంత్రం 6 గంటల నుంచి గోదాదేవి కల్యాణం నిర్వహించనున్నారు. పిఠాపురం నియోజకవర్గ పరిధిలో కొత్తపల్లి, గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లో వివిధ వైష్ణాలయాల్లోనూ ప్రత్యేక పూజలు జరగనున్నాయి. అలాగే వివిధ దేవాలయాల్లో సోమవారం నుంచి మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

యువతకు వివేకానందుడు ఆదర్శం



సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో స్వామి వివేకానంద జయంతి వేడుకలో సీఐ, ఎస్సై తదితరులు



పిఠాపురంలో వివేకానందుని విగ్రహానికి నివాళులర్పిస్తున్న పాఠకులు, అధికారులు

సామర్లకోట: యువతకు స్వామి వివేకానందుడు ఆదర్శమని సీఐ ఎ.కృష్ణభగవాన్, ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు అన్నారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక స్టేషన్ సెంటర్‌లో మదర్‌థెరిసా వలంటరీ ఆర్గనైజేషన్ అధినేత జి.రాజు మాస్టారు ఆధ్వర్యంలో ఏర్పాటైన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. నిరంతరం శ్రమిస్తూ ఆత్మస్థైర్యం, ఓరిమి కలిగి ఉన్న సామాన్యులే దేశానికి వెన్నెముకగా వివేకానందుడు ప్రచారం చేశారని తెలిపారు. వివేకానందుని సేవలను గుర్తించిన భారత ప్రభుత్వం 1984లో ఆయన పుట్టిన రోజును యువజన దినోత్సవంగా ప్రకటించిందని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. మదర్ థెరిసా వలంటరీ ఆర్గనైజేషన్ అధినేత జి.రాజు మాస్టారు పేదలకు సమకూర్చిన నిత్యావసర సరకులను ముఖ్య అతిథులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీభీమేశ్వర జర్నలిస్టు అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు అడపా వెంకట్రావు, కానిస్టేబుల్స్, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, బసివిరెడ్డి సత్రం యజమానులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు. నీలమ్మ చెరువు వివేకానంద గ్రంథాలయం వద్ద ఉన్న వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో చిన్నారులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సేవా సమితి నాయకులు కర్రి ఆదినారాయణరెడ్డి, కంచర్ల రామకృష్ణ, కాపుగంటి పైడిరత్నం పాల్గొన్నారు. వేట్లపాలెంలో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో వివేకానందుని జయంతి వేడుకలు నిర్వహించారు.

పిఠాపురం: పట్టణంలో ఆదివారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. స్థానిక సూర్యరాయ విద్యానంద గ్రంథాలయంలో వివేకానందుని విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. యువత వివేకానందుని జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కొండేపూడి శంకరరావు, బాదం ఉదయ సూర్యప్రకాష్, వెన్నపు చక్రధరరావు, ఊటుకూరి కేశవరావు, పెమ్మరాజు రామచంద్రరావు, అల్లవరపు నగేష్, ప్రసాద్ మాస్టర్, వనం వీరబాబు, సత్యప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మాండవ్యనారాయణస్వామి గ్రామోత్సవం

నేటి గోదా కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి



సామర్లకోటలో మాండవ్యనారాయణస్వామి గ్రామోత్సవం

సామర్లకోట: స్థానిక గోదావరి కాలువ సమీపంలో వేంచేసిన అతిపురాతన విష్ణు ఆలయంలో సోమవారం గోదా కల్యాణం నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ధనుర్మాసం సందర్భంగా గత నెల 16 నుంచి ఆలయంలో విశేష పూజలు నిర్వహిస్తున్నారు. ధనుర్మాసం ముగింపును పురస్కరించుకొని భోగి రోజు గోదా కల్యాణం నిర్వహిస్తారు. దీనిలో భాగంగా ఆదివారం స్వామివారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ఆలయం నుంచి కాలిబాట వంతెన మీదుగా ఫ్లైఓవర్ బ్రిడ్జి, సత్యనారాయణపురం, స్టేషన్ సెంటర్, గాంధీచౌక్, చిన్నవీధి, పెద్దవీధి, యార్లగడ్డ వారి వీధి, మఠంసెంటర్, అయోధ్యరామపురం, కొత్తూరు మీదుగా తిరిగి గ్రామోత్సవం ఆలయానికి చేరింది. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. శేషుబాబు ఆచార్యులు, రఘురామ్ ఆచార్యులు, రవికుమార్ ఆచార్యులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

తిరునాళ్లకు సర్వం సిద్ధం



సామర్లకోటలో కావమ్మ ఆలయం



ఆలయంలో కావమ్మ, మారెయ్య

కావమ్మ ఆలయం వద్ద ఏర్పాట్లు

సామర్లకోట: స్థానిక రజక వీధిలో వేంచేసి ఉన్న కావమ్మ ఆలయంలో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు తిరునాళ్లకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సంక్రాంతిలో రైతులు భూములు, రైతులను పూజిస్తారు. అదే విధంగా గ్రామ దేవతలను ఆరాధిస్తారు. ఇందులో భాగంగా సామర్లకోటలో వేంచేసి యున్న కావమ్మ అమ్మవారిని దర్శించుకొని పూజలు చేస్తారు. సామర్లకోట మండలం నుంచే కాకుండా పిఠాపురం, పెద్దాపురం మండలాలకు చెందిన భక్తులు తరలి వస్తారు. సంక్రాంతిని పురస్కరించుకుని తిరునాళ్ల నిర్వహించనున్నారు. కావమ్మ తిరునాళ్లకు వచ్చిన గర్భిణులు పండ్లను నీటిలో వేయడం ద్వారా తేలితే మగ బిడ్డగా, మునిగితే ఆడ బిడ్డగా భావిస్తారు. ప్రతి ఏడాది మారెయ్య, కావమ్మ వారసులు సుకపట్ల ఆదినారాయణ, నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఉత్సవాలు జరుగుతాయి. మంగళవారం నుంచి జరిగే ఉత్సవాలను తిలకించడానికి అనేక గ్రామాలకు చెందిన భక్తులు తరలి వస్తారు. ఆలయానికి చేరుకోవడానికి ఏలేరు కాలువపై కాలి బాట వంతెన నిర్మించారు.

ఆకతాయిలకు అడ్డుకట్ట వేయాలి



కావమ్మ అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు అధికంగా వస్తుంటారు. గర్భిణులు ఆలయం వద్ద ఉన్న బావిలో ఎక్కువగా పండ్లు వేస్తారు. వీటిని దృష్టిలో ఉంచుకుని ఆకతాయిలు ఆలయం వద్ద జరిగే తిరునాళ్లలో జూదం ఎక్కువగా జరుగుతుంది. దాంతో మహిళలు ఇబ్బంది పడుతున్నారు. పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలి.

–ఇరుసుమళ్ల సాయి, రజకపేట, సామర్లకోట

ఘనంగా నగర సంకీర్తన



వేట్లపాలెంలో పారాయణ చేసిన నగర సంకీర్తన బృందం

సామర్లకోట: స్థానిక విఘ్నేశ్వరా సినిమా థియేటర్ ఎదురుగా ఉన్న వేణుగోపాలస్వామి ఆలయ భక్త కమిటీ సభ్యులు ధనుర్మాసం ప్రారంభం నుంచి పట్టణంలోని ప్రతి వార్డులో నగర సంకీర్తన నిర్వహించారు. ఈ మేరకు ఆదివారం సామర్లకోట నుంచి వేట్లపాలెం వరకూ నగర సంకీర్తన చేపట్టారు. అనంతరం వేట్లపాలెం వేంకటేశ్వరస్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో వేంకటేశ్వర పారాయణ చేశారు. ఆలయ ధర్మకర్త పెండ్యాల నాగేశ్వరరావు మాస్టారు భక్త కమిటీ సభ్యులను సత్కరించారు.

ఆధ్యాత్మికతతో లోక శాంతి



పెద్దాపురంలో బహుమతులు అందుకున్న విజేతలతో మల్లికార్జున స్వామి తదితరులు



పులిమేరు శాంతివర్ధనలో వివేకానందునికి నివాళులర్పిస్తున్న విభిన్న ప్రతిభావంతులు

పెద్దాపురం: ఆధ్యాత్మిక భావంతో లోక శాంతి సిద్ధిస్తుందని భగవద్గీత ప్రచార సమితి వ్యవస్థాపకుడు మల్లికార్జున స్వామి అన్నారు. స్థానిక సత్తిరెడ్డిపేట భగవద్గీత ఆలయం వద్ద స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఆదివారం భగవద్గీత శ్లోకాల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రచార సమితి ఆర్గనైజర్ సత్యకుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ స్వామి వివేకానందను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు నడవాలన్నారు. బాలబాలికలు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలన్నారు. అనంతరం దేశభక్తి, దైవభక్తి పాటల పోటీల విజేతలకు వారి చేతుల మీదుగా బహుమతుల ప్రదానం జరిగింది. న్యాయనిర్ణేతలుగా సాంస్కృత పండిట్ దర్భా వెంకటశర్మ, ఆర్గనైజర్ సత్యకుమార్, నేతి వీరభద్రరావు, కృష్ణదేవ మనోహర్, వేదగీతామత, అంబిక, శ్రీదేవి, రామచరణ్, విద్యార్థులు పాల్గొన్నారు. పులిమేరు శాంతివర్ధన విభిన్న ప్రతిభావంతుల పాఠశాలలో స్వామి వివేకానంద జయంతి వేడుకలు నిర్వహించారు. పాఠశాల నిర్వాహకుడు రాయవరపు వీరబాబు ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ ఆర్.సత్య అధ్యక్షతన జరిగిన వేడుకలో వివేకానంద వేషధారణలో ఓ విద్యార్థి వేషధారణ ఆకట్టుకుంది. పాఠశాల ఏఓ వేణు, చంటి, శాంతివర్ధన్, అప్పలరాజు, శివ, ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతికి పల్లెలు సిద్ధం

- నేడు భోగి పండగ
- భోగి మంటకు ఏర్పాట్లలో తలమునకలు



సామర్లకోటలో మహిళలతో కోడి పందేలు



సామర్లకోట 31వ వార్డులో భోగి మంట చుట్టూ తిరుగుతున్న స్థానికులు

పిఠాపురం: నియోజకవర్గంలో పల్లెలు సంక్రాంతికి సిద్ధమయ్యాయి. ప్రతి ఇల్లు రంగవల్లులతో కళకళలాడుతుంది. సంక్రాంతి పండగ నాలుగు రోజుల్లో ముందు వచ్చే భోగి పండగ అంటే చిన్నా, పెద్దా అందరూ సందడి చేస్తుంటారు. భోగి మంటల్లో భోగి పిడకలు వేసేందుకు చిన్నారులు పోటీ పడితే భోగి మంటలను పెద్దగా వేసేందుకు పెద్దలు ఏర్పాట్లు చేస్తున్నారు. భోగి మంటలు వేసేందుకు చిన్నారులు తమ సాయశక్తులా కృషి చేస్తున్నారు. గ్రామాల్లో ఎక్కడ దుంగలు కనపడినా మాయం చేసి భోగి మంటకు సిద్ధం చేస్తున్నారు. పగటి వేషధారులు, డూడూ బసవన్నలు, హరిదాసుల సంచారంతో గ్రామాలు సంక్రాంతి శోభను సంతరించుకున్నాయి. ఇళ్ల ముందు రంగురంగుల ముగ్గులు అలరిస్తున్నాయి.

31వ వార్డులో...

సామర్లకోట: వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పాగా సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో 31వ వార్డులో ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంక్రాంతి సంప్రదాయాన్ని మరిపించేలా మహిళలతో కోడి పందేలు జరిపారు. ముగ్గుల పోటీలు ఏర్పాటు చేసి విజేతలకు బహుమతులు అందజేశారు. సంక్రాంతికి స్వాగతం పలుకుతూ భోగి మంటలు వేశారు. భోగి మంట చుట్టూ హరిదాసు వేషధారణలతో పాటలు పాడుతూ సంక్రాంతి సంబరాలను జరుపుకొన్నారు. ఈ సందర్భంగా పట్టణ డాక్టర్ మహోన్నత్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు ఉచితంగా బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.

నేడే భోగభాగ్యాల భోగి

సామర్లకోట: సంక్రాంతి పండగకు స్వాగతం పలికే భోగి పండగను సోమవారం జరుపుకోవడానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. భోగి మంటలు వేయడానికి పిల్లలు, పెద్దలు కర్రలను సిద్ధం చేశారు. పట్టణ పరిధిలోని అన్ని వార్డులు, గ్రామాల్లో మంటలు వేయడానికి ఏర్పాట్లు జోరుగా జరుగుతున్నాయి. ఇప్పటికే కర్రలు, దుంగలను సేకరించారు.

కొత్తపల్లి: ఎప్పుడెప్పుడు పండుగ-ఏడాది పండుగ.. అల్లుడు ఎందుకు వచ్చాడు- అరిసెలు తినడానికి వచ్చాడు.. కూతురు ఎందుకు వచ్చింది-కుడుములు తినడానికి వచ్చింది.. చింతచెట్టుపై దెయ్యం-మాకేం భయ్యం అనే పాటలతో గ్రామాల్లో సంక్రాంతి సందడి నెలకొంది. చిన్నారులు రాగయుక్తంగా పాడుతూ గ్రామంలోని ఇంటింటికీ వెళ్లి కట్టెలు, పిడకలను దండుతూ భోగిమంటకు సిద్ధమవుతున్నారు. సోమవారం భోగిపండుగను పురస్కరించుకొని మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం నుంచి సందడి నెలకొంది. గ్రామాల్లోని పిల్లలు, పెద్దలు అనే తారతమ్యం లేకుండా దుంగల సేకరణలో నిమగ్నమయ్యారు. కొందరు ఆకతాయి పిల్లలు ఇళ్లముందు, ఆరుబయట, దుకాణాల్లో ఉండే చిన్న చిన్న కర్రలు, కట్టెలను భోగిమంటల్లో వేసేందుకు సేకరిస్తున్న తీరు పెద్దలకు చిరుకోపంతో పాటు సంతోషాన్ని ఇచ్చింది. ఈ సంఘటనలు కేవలం పల్లెలకు మాత్రమే పరిమితమయ్యాయి. మరో పక్క బాలబాలికలు భోగిమంటల్లో వేసేందుకు భోగి పిడకలను సిద్ధం చేశారు.



పిఠాపురంలో భోగి మంట కోసం చిన్నారుల పుల్లల సేకరణ



అమ్మకానికి సిద్ధంగా భోగి పిడకలు



పిఠాపురంలో డూడూ బసవన్నల సందడి



సామర్లకోటలో భోగి మంటకు కర్రలను సరి చేస్తున్న స్థానికులు



కొత్తపల్లి మండలంలో భోగి మంటకు దుంగలు సేకరిస్తున్న పిల్లలు